క్లుప్తంగా

రేపు మంచినీళ్ల పండుగ

కొడంగల్: తెలంగాణ మంచినీళ్ల పండుగను ఆదివారం నిర్వహిస్తున్నట్లు మిషన్ భగీరథ అధికారులు తెలిపారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంచినీళ్ల ఉత్సవాన్ని జరపనున్నట్లు చెప్పారు. పట్టణ శివారులోని సిద్దనొంపు సమీపంలో ఉన్న మిషన్ భగీరథ నీటి శుద్ధి కేంద్రం దగ్గర కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు గిరిజన దినోత్సవం

బొంరాస్‌పేట: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించే గిరిజన దినోత్సవాలను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల యువనాయకుడు నెహ్రూనాయక్ కోరారు. తండాల్లో వేడుకల అనంతరం.. ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించాలన్నారు.

విజయవంతం చేయాలి

బంట్వారం: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే గిరిజనోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ బాలయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బంట్వారం మండలంలో ఉన్న ఒకే ఒక్క గిరిజన గ్రామంలో సభ ఉంటుందని, ఇందులో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పల్లెబాట నేడు

పూడూరు: పల్లెబాటలో భాగంగా శనివారం పూడూరు మండలంలో పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పర్యటించనున్నారని ఎంపీపీ మల్లేశం తెలిపారు. అంగడిచిట్టంపల్లి, రేగడిమామిడిపల్లి, చన్గోముల్, కుత్బుల్లాపూర్, మిట్టకంకల్, కడుమూరు, మేడిపల్లికలాన్ గ్రామాల్లో కార్యక్రమం ఉంటుందన్నారు.

ముదిరాజ్‌లకు కులవృత్తి రుణాలివ్వాలి

బొంరాస్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిన తరగతుల (బీసీ)కులాలకు అందజేస్తున్న కులవృత్తి సాయం కింద రూ.లక్షను ముదిరాజ్‌లకు కూడా ఇవ్వాలని ఆ సంఘం నాయకులు రాములు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మాట్లాడారు. తెలంగాణలో బీసీ కులాల్లో ఎక్కువ జనాభా ఉన్న ముదిరాజ్ కులాలకు రూ.1లక్ష రుణాల జాబితాలోకి చేర్చాలని కోరారు. ముదిరాజ్‌లకు చేపలుపట్టే వృత్తి ఉన్నప్పటికీ.. మత్స్యకారులుగా గుర్తించి కులవృత్తుల రుణాల్లో లబ్ధి చేకూర్చాలన్నారు.

ప్రాంగణం సరే.. పరికరాలు ఏవి?



నీటూరులో ఊరికి దూరంగా ఉన్న ప్రాంగణం

కొడంగల్: గ్రామాల్లో ప్రభుత్వం నిర్మించిన గ్రామీణ క్రీడా ప్రాంగణాలు ఆటలకు దూరంగా ఉన్నాయి. ఊరికి దూరంగా స్థలం కేటాయించడంతో ఆటలకు అనువుగా లేకుండా పోయాయి. క్రీడాకారులు అక్కడికి వెళ్లడానికి సుముఖంగా లేకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. శిక్షణ పొందాలంటే కనీస సౌకర్యాలు ఉండాలని, అవేవీ లేకుండా తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణం పేరుతో బోర్డులు పెట్టి చేతులు దులుపుకొంటే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ఆటలకు అవసరమైన పరికరాలు, కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని క్రీడాకారులు కోరుతున్నారు.

ఉత్తమ పంచాయతీ కార్మికురాలిగా శోభమ్మ



శోభమ్మకు అవార్డు అందజేస్తున్న పీఆర్ డిప్యూటీ కమిషనర్

అనంతగిరి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పల్లె ప్రగతి దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం రాత్రి రవీంద్రభారతిలో వికారాబాద్ మండలం మైలారంపల్లి గ్రామపంచాయతీకి చెందిన శోభమ్మ ఉత్తమ కార్మికురాలిగా అవార్డు అందుకున్నారు. జిల్లా నుంచి ఇద్దరు కార్మికులు ఈ అవార్డు అందుకోగా.. వారిలో ఈమె ఒకరు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సత్తయ్య, ఎంపీఓ నాగరాజు, సర్పంచ్ తిరుపతిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజు, పలువురు గ్రామస్తులు అభినందించారు.

ఘనంగా జంగే షహీద్ ఉర్సు ఉత్సవాలు

బొంరాస్‌పేట: సాలానా ఉర్సే షరీఫ్ జంగే షహీద్ ఉర్సు ఉత్సవాలు రెండో రోజు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బాద్ నమాజ్ మగ్రిబ్ దీపారాధన నిర్వహించారు. అలాగే దరూద్ మహిఫిల్, సలాం జరిపించారు. శనివారం బాద్ నమాజ్ ఫజర్ జియారత్ ఫాతేహఖాని ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

ఇది అంగన్‌వాడీ గుడ్డు!

- పౌష్టికాహారం పంపిణీలో ప్రత్యేక ముద్ర
- అక్రమాలు అరికట్టేందుకు చర్యలు
- సరఫరా ప్రారంభించిన ప్రభుత్వం
- కుళ్లినా కాంట్రాక్టర్లదే బాధ్యత

వికారాబాద్ అర్బన్/ దౌల్తాబాద్: చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ ఆరోగ్యం, విద్యా బలోపేతమే లక్ష్యంగా అంగన్‌వాడీ కేంద్రాలు పని చేస్తున్నాయి. వీటి ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రతి నెలా కోడిగుడ్లు ఇతర పౌష్టికాహార సరుకులు పంపిణీ చేస్తుంది. అయితే అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అయ్యే కోడిగుడ్లు పక్కదారి పడుతున్నాయనే ఆరోపణలు తరచూ వినిపిస్తున్నాయి. అలాగే కుళ్లి, చిన్న పరిమాణం కలిగిన గుడ్లు వస్తుండడంతో అవి చెత్త పాలవుతున్నాయి. ఈ క్రమంలో సమగ్ర స్త్రీ శిశు సంక్షేమశాఖ దిద్దుబాటు చర్యలు చేపట్టింది. అక్రమాలను నియంత్రించేందుకు ప్రభుత్వం కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. ఇకపై ప్రతి కోడిగుడ్డుపై అంగన్‌వాడీ గుడ్డు అని ముద్రించనున్నారు. ఇప్పటికే ఈ ప్రక్రియ ప్రారంభమైంది.

కాంట్రాక్టర్లదే బాధ్యత..

సంబంధిత కాంట్రాక్టర్లు అంగన్‌వాడీ కేంద్రాలకు నాసిరకం గుడ్లు సరఫరా చేస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో గుడ్లపై ముద్ర వేసేందుకు అధికారులు నిర్ణయం తీసుకున్నారు. గుడ్డుపై అంగన్‌వాడీ అనే ముద్ర వేయడంతో నాసి రకం గుడ్ల సరఫరా నిజమా కాదా అనే విషయం తేలిపోనుంది. ఇకపై కాంట్రాక్టర్లు సరఫరా చేసే గుడ్లను అంగన్‌వాడీ టీచర్లు పరిశీలించిన తరువాతే తీసుకోవాల్సి ఉంటుంది. గుడ్లపై ముద్ర లేకుంటే వెంటనే సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. ముద్ర ఉన్న గుడ్లు ఏమాత్రం కుళ్లి పోయినా కాంట్రాక్టర్‌దే బాధ్యత. అంతే కాదు ముద్ర వేసిన గుడ్లను అంగన్‌వాడీలు లేక ఇతరులు ఎవరైనా బహిరంగ మార్కెట్లో విక్రయించే ప్రయత్నం చేసినా వాటిపై ముద్ర ఉండటంతో తేలిగ్గా గుర్తు పట్టి అక్రమాలను అరికట్టే అవకాశం ఉందని సంబంధిత అధికారులు అంటున్నారు.



చిన్నారులకు బొమ్మలు చూపి పాఠం చెబుతున్న అంగన్‌వాడీ టీచర్ (ఫైల్)

రోజుకు 50వేల గుడ్లు పంపిణీ..

జిల్లాలో 1,107 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 7 నెలల నుంచి 3 ఏళ్లలోపు చిన్నారులు 33,003 మంది, 3 ఏళ్ల నుంచి 6 ఏళ్లలోపు పిల్లలు 5,940 మంది, గర్భిణులు 6,195 మంది, బాలింతలు 5,804 మంది ఉన్నారు. వీరికి ఇప్పటికే ఆరోగ్యలక్ష్మి పథకం కింద పనిదినాలను బట్టి నెలకు 26 గుడ్లు, 200 మిల్లీ లీటర్ల పాలు, మధ్యాహ్న భోజనం అందజేస్తున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా రోజు 50,942 మందికి గుడ్లు పంపిణీ చేస్తున్నారు.

నెలలో మూడు రంగుల్లో...

దౌల్తాబాద్ మండలంలో 68 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 66 ప్రధాన, 2 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల పరిధిలో 2,739మంది చిన్నారులు, 273మంది గర్భిణులు, 219 మంది బాలింతలు నమోదై ఉన్నారు. కోడిగుడ్ల పంపిణీలో అక్రమాలను నియంత్రించేందుకు నెలలో పది రోజులకు ఒకసారి కోడిగుడ్లపై ప్రభుత్వం ప్రత్యేక రంగుతో కూడిన ముద్రను వేయనుంది. మొదటి విడతలో నీలిరంగు, రెండో విడతలో ఎరుపు, మూడో విడతలో ఆకుపచ్చ రంగులో అంగన్‌వాడీ గుడ్డు అని ముద్రిస్తారు.



తెలంగాణ ప్రభుత్వం ముద్రతో సరఫరా అయిన గుడ్లు

మరింత పారదర్శకత..



అంగన్‌వాడీల్లో ఇప్పటికే ఎంతో పారదర్శకత ఉంది. గుడ్లపై ముద్రతో పక్కదారి పట్టకుండా పూర్తి స్థాయిలో నివారించవచ్చునని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. జిల్లాలో జూన్ మొదటి విడతలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం ముద్రతో సరఫరా అయ్యాయి. దీంతో గుడ్లు పక్కదారి పట్టడానికి అవకాశం ఉండదు.

– కేతావత్ లలిత కుమారి, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారిణి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పూడూరు: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని, కొలువుదీరిన తొమ్మిదేళ్ల కాలంలో అనేక అభివృద్ధి పనులు చేసిందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. ఎంపీపీ మల్లేశం అధ్యక్షతన శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందిస్తున్నామని, నిరంతరం విద్యుత్ సరఫరా చేస్తున్నామని, మండల పరిధిలోని అన్ని గ్రామాలకు బీటీరోడ్లు నిర్మించామని, వచ్చే నెల నుంచి డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఇస్తామని ఎమ్మెల్యే చెప్పారు. పెద్ద ఉమ్మెంతాల్ సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామాల్లో అర్ధరాత్రి వరకు బెల్టుషాప్‌లు కొనసాగుతున్నాయని, నిత్యం గొడవలు జరుగుతున్నాయని చెప్పగా.. సమస్య పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ ఎస్‌ఐ వాణి తెలిపారు. విద్యుత్ లూప్‌లైన్‌లు, ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను షిఫ్టింగ్ చేయాలని అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని నిజాంపేట్ మేడిపల్లి సర్పంచ్ పెంటమ్మ సభ దృష్టికి తేగా.. ఎమ్మెల్యే స్పందిస్తూ గ్రామాల్లో సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరించే విధంగా వారు చర్యలు తీసుకుంటారని చెప్పారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పర్యటించి సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. వైస్ ఎంపీపీ మైపాల్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, ఎంపీడీఓ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.



పూడూరు: సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కార్పొరేట్‌కు దీటుగా..

పరిగి: కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. చిట్యాల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసి మాట్లాడారు. మనఊరు–మనబడి కార్యక్రమంలో సర్కారు బడుల రూపు రేఖలు మారిపోయాయని, ప్రతి ఒక్కరికి నాణ్యమైన విద్యను అందించడానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని చెప్పారు. కావున తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని స్థానికులకు సూచించారు. ఎంపీపీ అరవింద్ రావు, మండల విద్యాధికారి హరిశ్చందర్ ఉన్నారు.

ఘనంగా మైలమ్మ చెరువు బోనాలు

కుల్కచర్ల: మైలమ్మ చెరువుకు మత్స్యకార, ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగ ఘనంగా జరిపారు. మహిళలు బోనాలతో తల్లి సన్నిధికి చేరుకొని నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తమను చల్లంగా చూడు తల్లీ, పాడిపంటలు సమృద్ధిగా పండేలా దీవించమ్మా అని వేడుకున్నారు. ఉత్సవంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కరణం ప్రహ్లాదరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి మాట్లాడుతూ.. గ్రామానికి, ప్రజలకు చెరువు కన్నతల్లిలాంటిదని చెప్పారు. అనాదిగా వస్తున్న ఆచార వ్యవహారాలను పాటిస్తూ చెరువుకు బోనాలు చేసి, పూజలు చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సామ్యారెడ్డి, చాపలగూడెం సర్పంచ్ లక్ష్మణ్, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు చంద్రలింగం, మత్స్యసంఘం అధ్యక్షుడు కాటనిపల్లి ఆంజనేయులు, బీజేపీ మండల అధ్యక్షుడు మైపాల్, స్థానిక సంఘం నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



బోనాలను తీసుకెళ్తున్న గ్రామస్తులు

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు

తహసీల్దార్ కిరణ్‌కుమార్

మోమిన్‌పేట: ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ కిరణ్‌కుమార్ హెచ్చరించారు. ప్రభుత్వ భూమి పక్కన పట్టాదారు భూములు ఉండటంతో వాటిని కొందరు కలిపేసుకుంటున్నారని తెలిపారు. టేకులపల్లిలో ఇటీవల రవికుమార్ తన పట్టా భూమి సర్వే నంబరు 98,100,102లో ఏడు ఎకరాలు ఉండగా.. ప్రభుత్వ భూమి సర్వే నంబరు 99లో 2.01ఎకరాలను తన పట్టా భూమిలో కలిపేసుకొని క్రయవిక్రయాలు జరిపేందుకు యత్నించాడని పేర్కొన్నారు. అప్రమత్తమైన రెవెన్యూ సిబ్బంది సర్వే చేసి, ఆ సర్వే నంబర్లో బోర్డు వెయించినట్లు ఆయన వెల్లడించారు. సదరు వ్యక్తిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి కేసు నమోదు చేయించినట్లు చెప్పారు. ఆదే విధంగా చీమల్‌దరిలో సర్వే నంబరు182 ప్రభుత్వ భూమి మూడు ఎకరాలు అసైనీ చాకలి నర్సింహులు సాగు చేయకుండా బీడుగా వదిలేశాడని, గతేడాది ఐరా కంపెనీకి లీజుకు ఇవ్వడంతో అక్కడ ఉన్న ఫాంపండును పూడ్చేందుకు ప్రయత్నించగా.. రెవెన్యూ సిబ్బంది ఆ స్థలాన్ని తిరిగి స్వాధీనం చేసుకొని దశాబ్ది వనం కొరకు ఇచ్చామన్నారు. ఇలా ఎవరైనా ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు.



ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన బోర్డు

ఉన్నత పాఠశాల.. ఉన్నది ఒక్కరే!

'సదువు సారెడు.. బలపాలు దోసెడు' అనే సామెతను ఈ విద్యార్థులకు వివరించి చెప్పే అవసరం లేదు. వారే అందరికీ చెప్పగలరు. బడిలో బలపాల్లాంటి విద్యార్థులు బోలెడున్నారు. కానీ.. సరిపడా బోధనా సిబ్బంది లేరు. ఉన్న ఒకే ఒక్క ఉపాధ్యాయుడితో అతి కష్టంగా చదువు కొనసాగిస్తున్నారు.

- పేరుకే పెద్ద బడి
- ఏకోపాధ్యాయ పాఠశాలగా ఎంపీహెచ్‌ఎస్
- ఐదు తరగతులకు ఒక్కటే పోస్టు
- స్వచ్ఛంద బోధన చేస్తున్న పీఎస్ ఎస్‌జీటీలు

బొంరాస్‌పేట: రేగడిమైలారంలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు ఉన్న ఐదు తరగతుల్లో 170మంది విద్యార్థులు ఉండగా.. ఉపాధ్యాయుడు ఒక్కడే ఉండడం గమనార్హం. యూపీఎస్‌గా మారినప్పుడు మంజూరైన ఎస్‌ఏ బయోసైన్స్ పోస్టు తప్ప ఇప్పటివరకు ఉపాధ్యాయ పోస్టులు మంజూరు కాలేదు. ఇదే పాఠశాలలో మరో వైపు ఉన్న 1 నుంచి 5 తరగతుల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులైన ఎస్‌జీటీలు ఉన్నత పాఠశాల విద్యార్థులకు దత్తత విధానంలో స్వచ్ఛంద బోధన చేస్తున్నారు.



రేగడిమైలారం ఎంపీహెచ్‌ఎస్

ఇంత వరకు ఎలా ఉన్నా.. వార్షిక పరీక్షల సమయంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాలలో పదో తరగతి ఫలితాలు అంతంత మాత్రమేనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. తమ పాఠశాలలో ఉపాధ్యాయుల సమస్యను పట్టించుకోవడం లేదని, గాడి తప్పుతున్న విద్యార్థుల చదువుల గురించి ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని ఉపాధ్యాయుడితో పాటు.. స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. ప్రాథమికోన్నత పాఠశాల నుంచి ఎంపీహెచ్‌ఎస్‌గా 2017–18 విద్యాసంవత్సరంలో మారింది. అప్పటి నుంచి 1నుంచి 5 తరగతులు వేరుగా, 6నుంచి 10 తరగతులు విద్యార్థులు వేరుగా విద్యాబోధన సాగుతోంది. ఈ విద్యాసంవత్సరంలో 170మంది విద్యార్థులున్నారు.

ఆందోళనకు సిద్ధం?

విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమస్యను తీర్చుకునేందుకు ఆందోళన బాట పట్టనున్నట్లు తెలుస్తోంది. సమస్య గురించి విద్యాశాఖ మంత్రికి, అధికారులకు, నేతలకు వినతిపత్రాలు అందజేశారు. పలు సభలు, సమావేశాల్లో తెలిపారు. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. పేరుకే పదో తరగతి పాఠశాల అని, ఫలితాల్లో శూన్యమని, అందుకే ఆందోళనకు దిగనున్నట్లు స్థానికులు చెప్పారు.

ఎంత కష్టపడి చదివినా..



ఎంపీహెచ్‌ఎస్ రేగడిమైలారం మా ఉన్నత పాఠశాలలో హార్డ్ వర్క్ చేస్తున్నాం. ఎంత కష్టపడి చదివినా ఉత్తీర్ణతలో అంతంతే. అందుకు కారణం మాకు పాఠాలు చెప్పే ఉపాధ్యాయులు లేకపోవడమే. పక్క గదుల్లో ఉండే ప్రాథమిక పాఠశాల టీచర్లు బోధిస్తున్నారు.

– సావిత్రి, పదో తరగతి విద్యార్థిని

ఎలా ముందుకు వెళ్లాలి?



ప్రతి సబ్జెక్టుకు టీచరు కావాలి. కానీ ఒక్కరే ఉన్నారు. రెండేళ్లుగా విద్యావలంటీర్లు కూడా లేరు. ఇంకా ఇబ్బందిగా ఉంది. ప్రైవేటు పాఠశాలలకు ఫీజులు కట్టి చదివించే స్తోమత మా తల్లిదండ్రులకు లేదు. ప్రభుత్వ బడుల్లో పట్టించుకునే వారు లేదు. ఎలా ముందుకు వెళ్లాలి?

– నితిన్, పదో తరగతి విద్యార్థి

ఉపాధ్యాయుల కొరత తీవ్రం



పదో తరగతిలో 26 మంది విద్యార్థులు ఉన్నారు. అందులో 18మంది బాలురు, 7మంది బాలికలు ఉన్నారు. గతేడాది 20మందికి గానూ 9మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. విద్యాశాఖ మంత్రికి విన్నవించాం. బయోసైన్స్ ఎస్‌ఏగా ఏకోపాధ్యాయున్ని ఉన్నాను. ఉపాధ్యాయుల కొరత ఇబ్బందిగా ఉంది.

– శంకరయ్య, హెచ్‌ఎం, ఎంపీహెచ్‌ఎస్

ప్రగతి బాటలో తాండూరు పట్టణం

ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి



జయశంకర్‌సార్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

తాండూరు: తాండూరు పట్టణాన్ని ప్రగతి బాటలో నడిపిస్తానని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న ఆధ్వర్యంలో పట్టణ ప్రగతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మునిసిపల్ కార్యాలయం ఎదుట మహిళలు ముగ్గులు వేశారు. అనంతరం ఎమ్మెల్యే, చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ పట్లోళ్ల దీప, కౌన్సిలర్లు, మున్సిపల్ కార్మికులు, నాయకులు, కార్యకర్తలు పట్టణంలో ర్యాలీ తీశారు. ఇందిరాచౌక్ కూడలిలో ప్రొఫెసర్ జయశంకర్‌సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ ఎంతో అభివృద్ధి చెందిందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సందల్‌రాజుగౌడ్, కౌన్సిలర్లు మంకాల రాఘవేందర్, బోయరాజు, రత్నమాల, నీరజ, మమత, మధుబాల, శ్రీనివాస్‌రెడ్డి, వెంకన్నగౌడ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• పంట నష్ట పరిహారం చెల్లించాలి

బంట్వారం: ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులందరికీ నష్ట పరిహారం చెల్లించాలని రైతు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మర్రి రాజిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని కోరారు. లేని యెడలా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

• సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య



పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న సర్పంచ్

పెద్దేముల్: ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందుతుందని సర్పంచ్ విజయమ్మ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి, విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సాహకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సింహులు, విద్యా కమిటీ చైర్మన్ రాములు, ఉపాధ్యాయులు రవీందర్‌రెడ్డి, నర్సిరెడ్డి, రాధ, సంగీత తదితరులు పాల్గొన్నారు.

• ఇసుక పర్మిషన్ రద్దు

తాండూరు రూరల్: పాత తాండూరు వాసుల ఆందోళనతో రెవెన్యూ అధికారులు దిగొచ్చారు. ప్రజల కోరిక మేరకు పాత తాండూరు శివారులోని కాగ్నానది నుంచి ఇసుక అనుమతులు రద్దు చేసినట్లు తహసీల్దార్ చిన్నప్పల నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాగ్నా నది నుంచి ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెవెన్యూ అధికారుల ప్రకటనతో స్థానికులు హర్షం వ్యక్తంచేశారు.

• పార్టీ బీమా చెక్కు అందజేత



బీమా చెక్కు అందజేస్తున్న మాజీమంత్రి

ధారూరు: పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని మాజీమంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డిలు అన్నారు. ధారూరు మండల కేంద్రానికి చెందిన బంగ్లా పాపయ్యగౌడ్ అనే కార్యకర్త ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందాడు. మృతుడికి పార్టీ సభ్యత్వం ఉండడంతో.. పార్టీ నుంచి మంజూరైన రూ.2లక్షల బీమా చెక్కును మృతుడి భార్య విజయలక్ష్మికి వారివురు శుక్రవారం అందజేశారు.

• బీటీరోడ్డు నిర్మించండి..



కంకర తేలి ఉన్న ఐనాపూర్ మల్లేపల్లి రహదారి

దోమ: ఐనాపూర్–మల్లేపల్లి రహదారి కంకర తేలి వాహనదారులకు ఇబ్బందిగా మారింది. బీటీరోడ్డు మంజూరైనా టెండర్ల ప్రక్రియ, పనుల ప్రారంభం వంటి కార్యక్రమాలు ఇంకా ప్రారంభ దశను దాటలేదు. రానున్నది వర్షాకాలం కావడంతో రహదారి మరింత అధ్వానంగా తయారవుతుందని, అధికారులు త్వరగా స్పందించి బీటీ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

• సర్టిఫికెట్లు త్వరగా ఇవ్వాలి

దోమ: పాఠశాలల ప్రారంభం నేపథ్యంలో విద్యార్థులకు అవసరమైన కులం, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు అందించడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఐనాపూర్ ఎంపీటీసీ విజయ ఆరోపించారు. భావిభారత పౌరులకు గౌరవం ఇచ్చి, వారికి అవసరమైన సర్టిఫికెట్లు త్వరగా ఇవ్వాలని ఆమె సూచించారు.

• 20వరకు సర్వే పూర్తి చేయాలి

పెద్దేముల్: ఈ నెల 20 వరకు బీఎల్వోలు ఇంటింటికి తిరిగి ఓటు క్రాసింగ్‌తో పాటు చనిపోయిన వారి పేర్లు తొలగించి సర్వే పూర్తి చేయాలని తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్వోలతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలని చెప్పారు. చనిపోయిన వారి పేర్లను తొలగించడానికి ఫారం నంబర్–7, కరెక్షన్ వారికి ఫారం నంబర్–8లో నమోదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మహేశ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజిరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

• సమగ్ర సర్వే చేయాలి

తాండూరు రూరల్: ఓటర్‌లిస్టుపై సమగ్ర సర్వే చేయాలని రెవెన్యూ అధికారులు ఆదేశించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలతో నిర్వహించిన సమావేశంలో రెవెన్యూ అధికారి వేణు మాట్లాడారు. బీఎల్వోలకు ఫ్రింట్ రికార్డులు అందజేశామని చెప్పారు. ఇంటింటికి వెళ్లి ఓటర్లకు సంబంధించి సమగ్ర వివరాలు రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. 23వ తేదీ లోపు సర్వే పూర్తి చేసి, తహసీల్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

మర్పల్లిలో..

మర్పల్లి: 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని మర్పల్లి తహసీల్దార్ శ్రీధర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్వోలతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఈ నెల 23 వరకు ఇంటింటి సర్వే చేసి, ఓటరు జాబితాలో తప్పొప్పులను సరి చేయాలని సూచించారు.

అర్హులందరికీ ఓటు హక్కు



బీఎల్వోలకు సూచనలు చేస్తున్న తహసీల్దార్ రమేష్‌కుమార్

కుల్కచర్ల: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పిస్తామని తహసీల్దార్ రమేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం తహసీల్ కార్యాలయంలో బీఎల్వోలతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన వారందరూ ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ మేరకు బీఎల్వోలు గ్రామాల్లో ఇంటింటి సర్వే చేస్తూ.. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులను ఓటుహక్కు నమోదు చేసుకునేందుకు అవగాహన కల్పించడంతో పాటు మార్పులు చేర్పుల ప్రక్రియ చేపట్టాలని చెప్పారు. అంతే కాకుండా మృతిచెందిన వారి ఓటుహక్కులను తొలగించాలన్నారు. కొందరి ఓట్లు ఇతర గ్రామాల్లో నమోదు కావడం, తప్పొప్పులను గమనించి మార్పులు చేర్పులు చేయాలన్నారు. కార్యక్రమంలో గిర్దవరి ఖాజ తదితరులు పాల్గొన్నారు.